సీఎంఆర్‌ఎఫ్ పేదలకు అండ

చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాచమల్లు


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు ఎంతగానో అండగా ఉందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని 11 మందికి రూ.12.23 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో నియోజకవర్గానికి కోట్ల రూపాయల డబ్బును సీఎం సహాయ నిధి ద్వారా మంజూరు చేయించామన్నారు. పేదలందరిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆదుకుంటోందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పరిధిలో లేని జబ్బులకు వైద్యం చేయించుకున్న వారికి బిల్లులు ఇస్తే, తన లెటర్ హెడ్ ద్వారా సీఎం సహాయ నిధి కోసం రెఫర్ చేయడం జరుగుతుందన్నారు. సంబంధిత వైద్యాధికారులు పరిశీలించి సీఎం సహాయ నిధిని మంజూరు చేస్తున్నారన్నారు. 30 ఏళ్లపాటు మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి డ్రైవర్‌గా పనిచేస్తున్న పిక్కిలి సుబ్బరాయుడుకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.3లక్షలు మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్లు భూమిరెడ్డి భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పాతకోట వంశీధర్‌రెడ్డి, పిట్టా బాలాజీ, మాజీ సర్పంచ్ దేవీప్రసాదరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండన్న పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని తిరుమల పాదయాత్ర

జగన్ మళ్లీ సీఎం కావాలని కోరుతూ చేపట్టిన పాదయాత్రను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శనివారం ప్రారంభించారు. స్థానిక పాతబస్టాండ్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం పాత బస్టాండ్ వ్యాపారులు కొండారెడ్డి, రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో 8 మంది తిరుమలకు పాదయాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని తిరుమలకు పాదయాత్ర చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌టీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు


చెక్కును రెడ్యం శ్రీనివాసులరెడ్డికి అందిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : అనారోగ్య కారణంగా ఇబ్బందులు పడుతున్న రెడ్యం శ్రీనివాసులరెడ్డి కుటుంబానికి రూ.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఖాజీపేట మండలం దుంపలగట్టు గ్రామానికి చెందిన రెడ్యం శ్రీనివాసులరెడ్డి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల కాలంలో ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం అందించారు. వైద్య ఖర్చు భారీగా ఉండటంతో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సహాయం కోరారు. వెంటనే అతని సమస్యను పరిశీలించి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 10 లక్షలు మంజూరు చేయించి వారికి చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు.

ఓటు హక్కు నమోదు చేసుకోండి

ప్రొద్దుటూరు : 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని జీఎస్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్ రామ్మోహన్ తెలిపారు. స్థానిక ఎస్‌సీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల, ఉర్దూ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలసి శనివారం గాంధీ రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం చౌడూరు, పెద్దశెట్టిపల్లె గ్రామాల్లో ఈవీఎం, వీవీ ప్యాట్లపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌బాబు, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైదుకూరు : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని మైదుకూరు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కౌసర్ భాను అన్నారు. మైదుకూరులో శనివారం ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ నమోదు అధికారి కౌసర్ భాను మాట్లాడుతూ శని, ఆదివారాల్లో ఆయా పోలింగ్ స్టేషన్లలో బూత్ లెవెల్ అధికారులు విధులు నిర్వహిస్తారని తెలిపారు. వారి వద్ద ఉన్న ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్నా ఓటరు జాబితాలో పేరులేకపోతే నమోదు చేసుకోవాలన్నారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

బద్వేలు అర్బన్ : నవజాత శిశువులతో పాటు గర్భిణీలు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని, తద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎ.ఉమామహేశ్వరకుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో శనివారం తొట్టిగారిపల్లె, సురేంద్రనగర్, కోటవీధి, గాంధీనగర్, అట్లూరు, గోపవరం, బి.కోడూరు పీహెచ్‌సీల వైద్యాధికారులకు, వైద్య సిబ్బందికి వ్యాధినిరోధక టీకా కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు, చిన్న పిల్లలకు యూనివర్సల్ ఇమ్యునైజేషన్ కింద వ్యాధినిరోధక టీకాలు వేసి వ్యాధుల నుంచి కాపాడాలని కోరారు. అనంతరం టీకాల పంపిణీ కార్యాచరణ గురించి జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మునిరెడ్డి వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మల్లేష్, వైద్యాధికారులు డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ హబీబ్‌బేగం, డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, గౌస్‌బాషా, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి ఖాజా మైనుద్దీన్

చాపాడు : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి ఖాజా మైనుద్దీన్ పేర్కొన్నారు. మండల న్యాయ సేవ సమితి ఆధ్వర్యంలో స్థానిక సీబీఐటీ కాలేజీలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ.. పుట్టబోయే బిడ్డ నుంచి మృతి చెందే వరకూ ప్రతి ఒక్కరికీ చట్టాలు ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టపరంగా ఎవరైనా న్యాయం కావాలంటే తమను సంప్రదించవచ్చన్నారు. ప్రభుత్వం ఉచితంగా న్యాయం పొందే అవకాశాన్ని కల్పించిందని, బాధితులు ఎవరైనా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులు వివిధ రకాలైన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దారు యామిని, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, ఎస్‌ఐ మైనుద్దీన్, మైదుకూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు నారాయణరెడ్డి, ప్యానల్ అడ్వకేట్ ఎన్.శ్రీనివాసులు, శివరామకృష్ణ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్డుదారులందరికీ రేషన్ అందించాలి

ప్రొద్దుటూరు : కార్డుదారులందరికీ రేషన్ అందించాలని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. ఆయన శనివారం మండల పరిధిలోని నంగనూరుపల్లె, పెన్నానగర్, రామేశ్వరం ప్రాంతాల్లో రేషన్ పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఎండీయూ ఆపరేటర్లతో మాట్లాడుతూ డీలర్ల నుంచి సరుకు తీసుకుని ప్రతి ఒక్కరికీ అందించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని కోరారు. తహసీల్దార్ నజీర్ అహ్మద్ మత్స్య కాలనీ, ఇస్లాంపురం, నెహ్రూ రోడ్డులో పర్యటించి రేషన్ పంపిణీని పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్ పాల్గొన్నారు.

రాత్రి 9 గంటల వరకూ ఇంటింటికీ రేషన్

చాపాడు : మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామ సచివాలయ పరిధిలో శనివారం రాత్రి 9గంటల వరకూ నిత్యాసర సరకులను రెవెన్యూ అధికారులు పంపిణీ చేశారు. ఎండీయూ పనితీరు సమస్య కారణంగా శనివారం సాయంత్రం వరకూ రేషన్ పంపిణీ జరగకపోవటంతో మండల తహసీల్దారు యామిని పర్యవేక్షణంలో ఆర్‌ఐ ప్రమీల, రీ సర్వేయర్ ప్రవీణ్, వీఆర్వో శ్రీనివాసులరెడ్డిలు స్వయంగా లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

ఖాజీపేట : అర్హత కల్గిన ప్రతి ఒక్కరి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, పార్టీలకు అతీతంగా అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందని ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. చెన్నముక్కలపల్లె పంచాయితీలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద గ్రామ సంక్షేమ అభివృద్ధి బోర్డును ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో కేవలం ఆ పార్టీ వారికే సంక్షేమ పథకాలు అందేవన్నారు. నేడు అర్హత ఉంటే అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో కృషిచేస్తోందని అన్నారు. కార్యక్రమంలో అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి సన్నిధిలో ఏపీ సచివాలయ మహిళా ఉద్యోగులు

బ్రహ్మంగారిమఠం: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీపోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామిని శనివారం ఏపీ సచివాలయం ఉద్యోగులు 120 మంది దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సచివాలయం ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షురాలు ఎం. లక్ష్మణకుమారి ఆధ్వర్యంలో వారు ఇక్కడికి వచ్చారు. స్థానిక పిట్‌పర్సన్ ఎండోమెంట్ ఏసీ శంకర్ బాలాజీ, దేవస్థానం మేనేజర్ ఈశ్వరాచారి మహిళా ఉద్యోగులకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలతో పాటు దేవస్థానం ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. దేవస్థానం విశిష్టత వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగ సంఘం సభ్యులు సుస్మిత, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

రేపు నీటి సరఫరా బంద్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణ పరిధిలో పలు ప్రాంతాలకు సోమవారం నీటి సరఫరా బంద్ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు. పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మెగా ఇంజనీరింగ్ వర్క్స్ వారు నూతనంగా నిర్మించిన పైపులైన్ అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ రిజర్వాయర్‌కు అనుసంధానం చేయు పనులు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. టీబీరోడ్డు మార్కెట్ యార్డు వద్ద వసంతపేట పంపింగ్ స్టేషన్ నుండి అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేసే పైపులైన్ పగిలిపోయి నీరు వృథాగా పోతోందని వివరించారు. పైపులైన్‌ను రిపేరు చేయుటకు నీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈనెల 4న శ్రీనివాసనగర్, మైదుకూరు రోడ్డు, సుబ్బిరెడ్డికొట్టాలు, రెడ్డినగర్, సరస్వతి విద్యామందిరం రోడ్డు తదితర ప్రాంతాల ప్రజలకు నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఊరేగింపుగా విగ్రహాలు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల చెరువుకట్టపై నిర్మించిన నూతన ఆలయంలో ప్రతిష్ఠించేందుకు ధ్వజ స్థంబం, శ్రీ కాలభైరవ, సుబ్రమణ్యేశ్వర, నాగదేవత, అక్కదేవతల విగ్రహాలను శనివారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుండి ఊరేగింపుగా తీసుకెళ్లారు. 650 సంవత్సరాల క్రితం ఉదయగిరిని పాలించిన భాస్కరరాయలచే నిర్మించబడిన పోరుమామిళ్ల చెరువుకట్టపై అప్పట్లో కాలభైరవ ఆలయం నిర్మించారు. కాలగమనంలో ఆ ఆలయం శిథిలం కావడంతో రాయల సేవాసమితి ఆధ్వర్యంలో ఇటీవల నూతన దేవాలయం నిర్మించారు. ఆలయంలో ప్రతిష్ఠించే విగ్రహాలతో శనివారం పట్టణం నుంచి చెరువు కట్టకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, ఆలయ గౌరవ అధ్యక్షుడు ఓబన్న (వైఎస్సార్‌సీపీ), అధ్యక్షులు రుద్రవరం వెంకటేశ్వర్లు, రాళ్లపల్లె నరసింహులు రాళ్లపల్లె రవికుమార్, మద్దిలేటి, సర్పంచ్ సుధాకర్, రచయిత బొల్లు రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచనలో ప్రతిభ


ఎస్పీ నుండి బహుమతి అందుకుంటున్న మయూరేశ్వరి

పోరుమామిళ్ల : జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పోరుమామిళ్ల ఓఎల్ఎఫ్ బాలికోన్నత పాఠశాల 10 వ తరగతి బాలిక మయూరేశ్వరి ప్రథమ స్థానంలో నిలచింది. శనివారం (ఈరోజు) జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ నుంచి రూ. 5000లు బహుమతి, ప్రశంసాపత్రం అందుకుంది. 'లైంగిక వేధింపులు- స్త్రీలు, పిల్లల రక్షణ సామాజిక బాధ్యత' అన్న అంశంపై అక్టోబర్ 26న జరిగిన జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల్లో మయూరేశ్వరి ప్రథమస్థానంలో నిలచింది. తమ పాఠశాల విద్యార్థిని బహుమతి అందుకోవడంపై కరస్పాండెంట్ సిస్టర్ లూసి, ప్రధానోపాధ్యాయురాలు ఆరోగ్యరాణి, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

టౌన్ బ్యాంకు డైరెక్టర్‌గా రమణారెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు టౌన్ బ్యాంకు డైరెక్టర్‌గా లక్కిరెడ్డి వెంకటరమణారెడ్డిని నియమించారు. గతంలో డైరెక్టర్‌గా ఉన్న కేకే ప్రసాద్ రెడ్డి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో రమణారెడ్డిని నియమించారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితోపాటు నాలుగో వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, కేకే ప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఆర్ఐటీలో సింపోజియం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి టెక్నోహోలిక్స్ ఇథోఫియా 2కె 23 టెక్నికల్ సింపోజియంను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేఎన్‌టీయూఏ ఈఈఈ హెచ్ఓడీ రామశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల డీన్ వెంకటరమణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సొంతంగా తమ ఆలోచనలను ప్రదర్శించడానికి కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవడానికి సింపోజియంలు తోడ్పడుతాయని తెలిపారు. ఈ సింపోజియంకు జాతీయ స్థాయిలో 711 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా కళ్యాణ్‌కుమార్, డాక్టర్ నాగేశ్వరరెడ్డి, హరినాథరెడ్డి, సంతోష్‌కుమార్, ప్రదీప్, సుబ్బరాయుడులు వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలించండి

అట్లూరు : మండల పరిధిలో కరెంటు కాంట్రాక్టరు చేస్తున్న పనుల్లో నాణ్యత కొరవడిందని.. కామసముద్రం సర్పంచు ఆర్వీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన అట్లూరు శ్రీశక్తి సభాభవనంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మండల అధ్యక్షురాలు పొత్తపి రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశంలో ఎంపీడీఓ సుజాతమ్మ మండల అధికారులను శాఖల వారిగా అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ట్రాన్సుకో ఏఈ విజయకుమార్ మాట్లాడుతుండగా కామసముద్రం సర్పంచు ఆర్వీ సుబ్బారెడ్డి స్పందించి కరెంటు కాంట్రాక్టరు పనులు నాసిరకంగా చేస్తున్నారని పర్యవేక్షించి చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం


ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహం

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని నాగులచెరువు కట్ట శివాలయం నుంచి శనివారం నిర్వహించిన అయ్యప్పస్వామి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గురుస్వాములు, అయ్యప్పస్వామి ఆలయ చైర్మన్ రాగిమాను ప్రతాప్ కుమార్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామోత్సవంలో వందలాదిమంది అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ వాకమళ్లరాజగోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కె.రమణారెడ్డిలు అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామి వారిని కొలువుదీర్చి పోరుమామిళ్లరోడ్డు, నెల్లూరు రోడ్డు, సిద్దవటం రోడ్డు, మైదుకూరు రోడ్డుల మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన కేరళ వాయిద్యాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తా శ్రీరాములు, కౌన్సిలర్ రాగిమానురవితేజ, గురుస్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్ ఈ నెల 19న చాపాడు మండలంలోని సీబీఐటీ కళాశాలలో జరుగనుందని దీనిని విజయవంతం చేయాలని ఇన్‌చార్జ్ ఉపవిద్యాశాఖాధికారి జి.రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయంలో ప్రొద్దుటూరు డివిజన్‌లోని మండలాల ఎంఈఓలతో జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నామన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మాథమేటిక్స్, ఎర్త్‌అండ్ స్పేస్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఇంజనీరింగ్, బయోకెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ మొత్తం 8 అంశాలపై నమూనాలు తయారు చేయాల్సి ఉంటుందన్నారు. ముందుగా ఈ నెల 13వ తేదీ లోపల పాఠశాల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించి అందులో ప్రథమ స్థానంలో నిలిచిన ప్రాజెక్టును మండల స్థాయికి ఎంపిక చేయాలన్నారు. ఈ నెల 16 లోపల మండల స్థాయిలో ఎంపికలు నిర్వహించి 3 ప్రాజెక్టులను జిల్లాస్థాయికి ఎంపిక చేయాలని వివరించారు. మండలానికి 3 చొప్పున, 36 మండలాలకు 108 నమూనాలు జిల్లాస్థాయిలో ప్రదర్శిస్తారన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన నమూనాలను ఈ నెల 28, 29లలో రాష్ట్రస్థాయిలో ప్రదర్శిస్తారన్నారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి, ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి, డివిజన్ పరిధిలోని మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.

అనంత విశ్వానికి భారత్ ఆదిగురువు


రామాయణ ప్రవచనం చేస్తున్న శ్రీనివాసులు

పోరుమామిళ్ల : అనంత విశ్వానికి ఆదిగురువు భారతదేశమని, ''నా దేశం కరుణాంతరంగ, నాదేశం సంస్కార గంగని, అగ్నిపునీతని'' డాక్టర్ సినారే చెప్పినట్లు అక్షరసత్యమని టీటీడీ కడప జిల్లా ప్రచారమండలి సభ్యులు తుపాకుల శ్రీనివాసులు పేర్కొన్నారు. టీటీడీ ధర్మప్రచారమండలి ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం నుంచి జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీనివాసులు రామాయణ ప్రవచనం చేశారు. ఆలయ అర్చకులు సతీష్‌శర్మ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. ఈ పూజా, ఆధ్యాత్మిక కార్యక్రమంలో తెలుగు అధ్యాపకురాలు రాణిరత్నప్రభ, జిల్లా ధర్మజాగరణ్ ప్రముఖ్ బాలరంగయ్య, ఏకల్ అభియాన్ జిల్లా అధ్యక్షులు చెన్నక్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించండి


కొండూరు పోలింగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ ఆకుల వెంకటరమణ

అట్లూరు : ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని బద్వేలు రెవెన్యూ డివిజనల్ అధికారి ఆకుల వెంకటరమణ పేర్కొన్నారు. మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఆయన శనివారం ఉదయం పరిశీలించారు. మండల పరిధిలోని 197 నుంచి 221 వరకూ పోలింగు కేంద్రాలు ఉండగా అన్ని కేంద్రాలను వాటి స్థితి గతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు, మార్పులు చేర్పులు, తొలగింపులు ఎక్కడా లోపాలు లేకుండా బాధ్యతాయుతంగా చేయాలన్నారు. కొంతమంది సిబ్బంది సమయ పాలన పాటించలేదని వారందరికీ మెమోలు జారీ చేయాలని తహసీల్దారు రవిశంకర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

బద్వేలుకు త్వరలో స్టేడియం

బద్వేలు పట్టణంలో త్వరలో మున్సిపల్ స్టేడియంను ఏర్పాటు చేస్తామని బద్వేలు రెవెన్యూ డివిజినల్ అధికారి ఆకుల వెంకటరమణ వెల్లడించారు. మండల కేంద్రమైన అట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి క్రీడలలో ఐదు మంది విద్యార్థులు పాల్గొనడంతో ఆయా విద్యార్థులను ఆయన అభినందించారు. బద్వేలులో స్టేడియం కోసం స్థలం కేటాయించామని.. అందుకు ఏర్పాట్లు చేయడం కూడా జరుగుతందని తెలిపారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు అశ్వర్థరెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీకమాసం మూడో శనివారం సందర్భంగా వేకువజాము నుంచి స్వామి, అమ్మవారికి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. భక్తుల దర్శనార్థం స్వామివారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

పరికరాలు మంజూరు

కాశినాయన : మండలంలోని 75 మంది వికలాంగులకు వికలాంగత్వ పరికరాలు మంజూరయ్యాయని ఎంపీడీఓ మైథిలి తెలిపారు. గతంలో ఆయా పంచాయతీల్లో సమావేశాలు ఏర్పాటు చేసి వికలాంగత్వ పరీక్షలు నిర్వహించారని, అందులో అర్హులైన వారికి పరికరాలు మంజూరైనట్లు తెలిపారు. వీరికి ఆదివారం ఉదయం 7 గంటల నుంచి బద్వేలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పరికరాలు అందజేస్తారని తెలిపారు. ఉదయం 7 గంటలకు కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు ఈ క్యాంపును ప్రారంభిస్తారని తెలిపారు.

5న కాలభైరవస్వామి జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులోని తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో 5న ఉదయం కాలభైరవ స్వామి జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు శ్రీ కాలభైరవ స్వామి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాసులస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారికి విశేష పూజాకార్యక్రమాలతో పాటు మధ్యాహ్నం 12.15 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

నేడు రథశాల ప్రారంభం

రాజుపాళెం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలోని వెల్లాల గ్రామంలో ఉన్న శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వాముల ఆలయాలకు సంబంధించిన రథశాలను ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రారంభించనున్నట్లు ఆలయ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి తెలిపారు. ఆలయంలో వారు శనివారం మాట్లాడుతూ రెండేళ్ల క్రితం భక్తులు, దాతలచే నూతన రథాన్ని దాదాపు రూ.30లక్షలతో తయారు చేయించామన్నారు. ఆ రథాన్ని ఉంచేందుకు పగిడాలకు చెందిన దివంగత కానాల రామకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వెంకటరామిరెడ్డి రూ.16 లక్షలతో రథశాల నిర్మించారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

విద్యా వ్యతిరేక విధానాలు తగవు

ప్రొద్దుటూరు : అశాస్త్రీయ భావాలకు జాతీయ విద్యావిధానం అద్దంపడుతోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గుజ్జుల వలరాజు తెలిపారు. మండలంలోని పెన్నానగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయంలో శనివారం ఏఐఎస్ఎఫ్ పట్టణ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానం అవలంబిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐఎస్ఎఫ్ నాయకులు పీటర్, ప్రేమ్ కుమార్, బన్నీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

దంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి

బి.కోడూరు : దంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని పోరుమామిళ్ల సామాజిక ఆరోగ్య కేంద్రం డెంటల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సవిత తెలిపారు. శనివారం బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బి.కోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించి విద్యార్థులకు దంత సమస్యలపై అవగాహన కల్పించి ఆరోగ్య విద్య అందించారు 51 మంది విద్యార్థులను పరీక్షించి 34 మందికి దంత సమస్యలు గుర్తించినట్లు ఆమె తెలిపారు. వీరందరిని పోరుమామిళ్ల సీహెచ్‌సీకి రెఫర్ చేశారు. హెల్త్ అసిస్టెంట్ రామతీర్థము, ఏఎన్ఎం కుమారి, ఆర్‌కెఎస్‌కె కౌన్సిలర్ భారతిలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్చిని సందర్శించిన విద్యుత్ అధికారులు

కలసపాడు : స్థానిక సగిలేరు ఒడ్డున వెలసిన పరిశుద్ధ పేతురు పరిశుద్ధ పౌలు చర్చి 136వ తిరునాలను పురస్కరించుకుని శనివారం ఏపీఎస్‌పీడీసీఎల్ ఏడీ చిన్నస్వామినాయక్ చర్చిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరునాల సందర్భంగా విద్యుత్ అంతరాయం కలిగితే వెంటనే సిబ్బందికి తెలియజేయాలన్నారు. ఎలాంటి సమస్యలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. విద్యుత్ సిబ్బంది బ్రహ్మానందరెడ్డి, కుమార్‌బాబు, సంజీవరాయుడు పాల్గొన్నారు.

6న మడూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

చాపాడు : మండల పరిధిలోని మడూరు గ్రామ సచివాలయ పరిధిలో ఈ నెల 6న ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి గ్రామ సచివాలయంలో గ్రామ వలంటీర్లు, గృహ సారథులకు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తామన్నారు.